తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి భేటీ

హైదరాబాద్: రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా నూతనంగా నియమితులైన శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి ఉ ప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం ప్రజా భవన్ నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

రాష్ట్ర ప్రణాళికా శాఖాపరమైన అంశాలపై వారు చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టాల్సిన ప్రణాళికలను, రూపొందించాల్సిన కార్యాచరణపై గద్వాల్ విజయలక్ష్మి డిప్యూటీ సీఎం భట్టితో విశ్లేషించారు. ప్రణాళిక శాఖ పరంగా సంపూర్ణ సహకారాన్ని అందించాలని విజయలక్ష్మి డిప్యూటీ సీఎం భట్టిని కోరారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 283 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | ఆదివారం, సెప్టెంబర్ 06, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

హైదరాబాద్‌లో TCS హైపర్‌వాల్ట్ ఏఐ డేటా సెంటర్.. ప్రభుత్వంతో ఒప్పందం



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. టీసీఎస్ హైపర్‌వాల్ట్, తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి (=వఙుఖ్‌ష్ట్ర =వసఎఅ) సమక్షంలో హైపర్‌వాల్ట్, ప్రభుత్వ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. 1 గిగా వాట్ సామర్థ్యంతో టీసీఎస్ హైపర్‌వాల్ట్ సంస్థ రూ.70వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా నుమారు 7వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మోదీ మాటల నుంచి స్ఫూర్తి పొందవచ్చు : బెల్జియం ప్రధాని

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 05: భారత ప్రధాని నరేంద్ర మోదీపై బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలో అత్యంత స్ఫూర్తిదాయకమైన నేతల్లో ప్రధాని మోదీ ఒకరని పేర్కొన్నారు. మోదీవి హేతుబద్ధమైన ఆలోచనలు అని కీర్తించారు. ఆయన చెప్పిన వాటిని మనం అనుసరించాలని పేర్కొన్నారు. మోదీ వివేకవంతమైన నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ప్రధాని మోదీ.. తెలివైన నాయకుడని ఆభివర్ణించారు. శనివారం దేశ ఆర్థిక రాజధాని ముంబై వేదికగా భారత్ – యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. భారత్‌లో పర్యటించడం గౌరవంగా ఉందన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో తాను సమావేశమయ్యానని పేర్కొన్నారు. ఆయనతో భేటీ కావడం గౌరవంగా ఉందన్నారు. గతంలో కోవిడ్ కారణంగా తన భారత పర్యటన రద్దయిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.ప్రపంచంలోని పలువురు నాయకులు బెదిరింపు ధోరణిలో మాట్లాడతారని అన్నారు. కానీ భారత ప్రధాని మోదీ మాటలు.. స్ఫూర్తితోపాటు మార్గదర్శకత్వాన్ని అందిస్తాయని చెప్పారు. నరేంద్ర మోదీ మాటలను అనుసరించాలనిపిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సుంకాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఎండగట్టారు.

భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి (ఖఅంఘ్ముఅ =వసఎఅ) ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి (జవీ =వఙుఖ్‌ష్ట్ర =వసఎఅ) సైతం భూములను అమ్మే ప్రయత్నం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. నిషేధిత భూసమస్యలపై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి దోచుకుంటోంది. భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు. 22ఏ కింద తమ భూములు ఉన్నాయని చాలామందికి తెలియదు. ధరణి పేరుతో బీఆర్ఎస్ (దీ=నా) ప్రభుత్వం ఎలా దోచుకుందో అందరికీ తెలుసు. రాష్ట్రాన్ని స్థిరాస్తి వ్యాపారంగా మార్చారు. అన్ని రకాల అనుమతులు ఉన్న భూములను 22ఏ జాబితాలో పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఉంది.

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ క్షీణించిపోయింది: రామచందర్ రావు

వక్ఫ్‌భూములపై తప్ప అన్ని భూములపై సీఎం రేవంత్ కన్నేశారు. రాష్ట్రాన్ని ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారు. ఉద్యోగులకు జీతాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితికి తెచ్చారు. 60 లక్షల ఎకరాలకు పైగా భూమిని 22ఏలో పెట్టారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉందా?కాంగ్రెస్ నాయకులను, అధికారులను హెచ్చరిస్తున్నా.. మీరు దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజలకు పంచుతాం. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ కూడా 30 శాతం కమీషన్ అడుగుతోంది. కమీషన్ల కోసమే ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. రానున్న రోజుల్లో 22ఏపై ఇంటింటికీ వెళ్లాలి.. రేవంత్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. 22ఏలో పెట్టిన పేదల భూములను తొలగించాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజు దగ్గరలోనే ఉంది : కేటీఆర్

యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చారు.. ఒక్కటంటే ఒక్కటి అమలు కూడా చేయలేదని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 100 రోజుల్లో అన్నీ అమలు చేస్తామని డైలాగులు కొట్టారు.. 1000 రోజులు అయిపోయింది.. 100 రోజులకు 10 రెట్లయింది.. ఏం చేసినవయా..? చెప్పు అంటే ఏమీ లేదన్నారు.బకాసురుల్లాగా మేస్తున్నరు.. కుంభకర్ణుల్లాగా పంటున్నరు.. పందికొక్కుల్లాగా తింటున్నరు? అది తప్ప ఏదీ లేదు చేసింది.. ఇక మిదికెళ్లి.. తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నారు.. ఎవరు చేయాలే.. ఎందుకు చేయలే రాజీనామా..? అని నేను అడుగుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాల్నా.. మీరు చెప్పాలే.. ఎవరు చేయాలే రాజీనామా.. అని కేటీఆర్ అడిగితే.. విద్యార్థులంతా ముక్తకంఠంతో రేవంత్ రెడ్డి అంటూ సమాధానమిచ్చారు. 100 రోజులు అని చెప్పి 1000 రోజులు మోసం చేసిన ధోకేబాజ్ (మోసగాడు)రాజీనామా చేయాల్నా లేదా.. అని అడిగారు. నిరుద్యోగులను నిండా ముంచిన లఫంగా పార్టీ కాంగ్రెస్ ఇయ్యాళ్ల పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందన్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండిఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ ఫైర్ అయ్యారు. పేద ప్రజల భూములతో ఇవాళ కాంగ్రెస్ పార్టీ చెలగాటమాడుతోంది.



కోట్ల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్ పార్టీ.. మీ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజు దగ్గరలో ఉందని కేటీఆర్ హెచ్చరించారు. 365 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలిస్తాం.. అని మా తమ్ముళ్లు, చెల్లెళ్లను మోసం చేసి వాళ్లు పోయి వాళ్ల తల్లిదండ్రులు, అత్తామామలు, తాత నాయినమ్మల కాళ్లు మొక్కేటట్టు చేసి కాంగ్రెస్‌కు ఓటేయించుకుని మోసం చేసినందుకు, బాండ్ పేపర్ రాసి మోసం చేసిన సన్నాసులకు తప్పకుండా భరతం పట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

రెండేళ్లు సమయం ఇవ్వండి.



ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ

హైదరాబాద్, సెప్టెంబర్ 5: రెండు సంవత్సరాలపాటు సహకరించి వెసులుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నిరుపేదల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టిన ఈ దశలో తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉ పాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రి దామోదర రాజనర్సింహ , ప్రభుత్వ సలహదారు కే కేశవరావు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించి ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఆర్థిక వెసులుబాటును బట్టి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. మిగతా శాఖలతో పోల్చితే విద్యా శాఖ ఆదర్శంగా నిలబడాలి. పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శకులు మీరే. రెండేండ్లు సమయం ఇవ్వండి. రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికి విజ్ఞప్తి చేస్తున్నా. రెండేండ్లలో సమస్యలన్నింటినీ సామరస్యంగా మీరు అడక్కుండానే పరిష్కరించే బాధ్యత నాది" అని స్పష్టం చేశారు. "తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక రోల్ మాడల్‌గా నిలబెడుదాం. అందుకు కథానాయకులు ఉపాధ్యాయులే. అందుకు ఉపాధ్యాయులంతా పునరంకితం కావాలి. ఇంట్లో సొంత పిల్లలను ఏ విధంగా తీర్చిదిద్దాలనుకుంటున్నారో మీ వద్ద చదువుకుంటున్న విద్యార్థుల విషయంలోనూ అంతే శ్రద్ధ పెట్టాలి. ఉపాధ్యాయులపై నాకు సంపూర్ణమైన విశ్వాసం ఉంది.ప్రభుత్వ సర్వీసులో మీరు 30 ఏళ్లకు పైగా సేవలందిస్తారు. రాజకీయ నాయకులం ప్రతి ఐదేళ్లకు ఒకసారి మీముందుకొచ్చి పరీక్షలు రాయాల్సిందే. నేను చెప్పిన ప్రకారం చేయకుండా ఉంటే.. నిర్ణయం తీసుకోవలసింది మీరే. అందుకు మార్కులు వేయాల్సిందీ మీరే. మీ చేతిలోనే కలం ఉంది. మీ చేతిలోనే బలం ఉంది" అని ముఖ్యమంత్రి గారు వ్యాఖ్యానించారు.

వెయ్యి రోజులుగా రాష్ట్రంలో రాబందు, రాక్షస పాలన సాగుతోంది: హరీశ్ రావు



సిద్దిపేట, సెప్టెంబర్ 05: తెలంగాణ రాష్ట్రంలో వెయ్యి రోజులుగా రాబందు, రాక్షస పాలన సాగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలోని రైతులను రాబందుల్లా పీక్కుతింటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. శనివారం దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సీపూర్ క్రాసింగ్ వద్ద 'రైతు పొలికేక' కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు భారీగా రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం నాడు ఈ తరహాలో ఉద్యమించామన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి పుణ్యమా అని నేడు మళ్లీ రోడ్లపైకి వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ కాస్తా ఐదారు గంటలకు పడిపోయిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోసం ఎదురు చూసే రోజులు ఉన్నాయా? అని ఈ సందర్భంగా రైతులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పిన పాత రోజులు మళ్లీ వచ్చాయని చెప్పారు. ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్ అయిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.నాడు కరోనా సమయంలోనూ రైతుబంధు ఆగలేదని హరీశ్ రావు గుర్తు చేశారు. రైతుల మీద కేసీఆర్‌కు ప్రేమ ఉండేదని.. మరి సీఎం రేవంత్ రెడ్డికి ఏమైందని హరీశ్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉన్న రైతుబంధుకు ఎసరు పెట్టారంటూ సీఎం రేవంత్‌పై ఆయన నిప్పులు చెరిగారు. ఈ మూడేళ్లలో రేవంత్ రెడ్డి రూ.29 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు బీమాను బంద్ చేశారని హరీశ్ రావు మండిపడ్డారు. యాప్‌లో బుక్ చేస్తే 15 రోజుల దాకా డీఏపీ ఇవ్వడం లేదన్నారు. షాపులో లేని యూరియా యాప్‌లోకి ఎలా వస్తుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. యూరియా ధరలను బీజేపీ ప్రభుత్వం పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్, బీజేపీ వాళ్లు రైతుల ఉసురు పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రం ఏ పంట ఎంత కొనుగోలు చేయమంటే.. అంతే కొనుగోలు చేస్తామని సీఎం అంటున్నారన్నారు.ఈ మూడేళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ఒక్క ఎకరా భూ సేకరణ చేయలేదని, జానెడు కాలువ కూడా తవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం రేవంత్ నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ వద్ద చిన్న మరమ్మతు చేయమంటే.. కూలింది కూలింది అంటూ ఆ ప్రాజెక్టును నిరూపయోగం చేశారని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అని అభివర్ణించారు.మేడిగడ్డ వద్ద 44 వేల క్యూసెక్కుల నీళ్లు పారుతున్నాయని మాజీ మంత్రి వివరించారు. మోటార్ ఆన్ చేస్తే మల్లన్న సాగర్‌కు నీళ్లు వస్తాయని చెప్పారు. వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు, వెయ్యి ఓట్లు, భూ కబ్జాలు తప్ప మరేమీ లేవన్నారు. యాప్‌లు పోవాలంటే సీఎం రేవంత్ రెడ్డిని పదవి నుంచి దించాలని రైతులకు ఆయన స్పష్టం చేశారు. రైతు బంధు ఎప్పటిలాగా రావాలంటే అధికారంలోకి కేసీఆర్ రావాలని హరీశ్ రావు స్పష్టం చేశారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

ఆదివారం, సెప్టెంబర్ 06, 2026

జీడీపీ పెరుగుతోంది... కానీ...

2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ వనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖి1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదుడబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు.ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

- ఎడిటర్

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

మహిళా సంఘాలకు విస్తృతంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు, మంత్రి సీతక్క

కొల్లాపూర్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్ కర్నూల్ జిల్లా : ప్రతినిధి తెలంగాణ పవర్ : సెప్టెంబర్ -5: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ సొంత కాళ్లపై నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు, రుణ కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, వివిధ రంగాల్లో వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ లతో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క రోడ్డు, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు పనులను శంకుస్థాపన చేశారు.

అనంతరం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాజా గారి బంగ్లా ఆవరణలో 1000 రోజు ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.....

మహిళలకు నిరంతరం పని కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల యూనిఫాంలు, పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు తదితర పనులను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నామని,ఈ విధంగా మహిళా సంఘాల సభ్యులకు స్థిరమైన ఆదాయ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కార్యక్రమం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రూ.2.53 కోట్ల మేర కమిషన్ ఆదాయం మహిళా సంఘాలకు లభించిందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా సంఘాలను భాగస్వాములను చేయడం ద్వారా వారికి ఉపాధితో పాటు ఆదాయ అవకాశాలను కూడా కల్పిస్తున్నామని చెప్పారు.

ప్రతి మహిళ ఏదో ఒక వ్యాపారం లేదా స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగస్వామి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు ఇంటి పరిధికే పరిమితం కాకుండా బయటకు వచ్చి ఆర్థిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు.

మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును స్వయంగా వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్తును విక్రయించడం ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

మహిళ ఆర్థికంగా, సామాజికంగా సంతోషంగా ఉంటే కుటుంబం బలోపేతం అవుతుందని, కుటుంబాలు బాగుంటే గ్రామాలు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మహిళా సంఘాల సమావేశాలు, కార్యకలాపాల నిర్వహణకు గతంలో సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదురయ్యేవని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం మహిళా సంఘాలకు ప్రత్యేకంగా ఇందిర మహిళా శక్తి భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

మహిళా సంఘాలు తమ సమావేశాలను, కార్యక్రమాలను సొంత భవనాల్లో నిర్వహించుకునేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఇందిర మహిళా శక్తి భవనం, జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు.

మహిళలు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు రవాణా సౌకర్యం కూడా కీలకమని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసినట్లు గుర్తుచేశారు.

మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగడంతో పాటు సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి, వారికి నిరంతర ఆదాయ మార్గాలు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీతక్క తెలిపారు.

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని,

తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గౌరవిస్తూ సోనియా గాంధీ నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు.

ప్రజల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వానికి మరోసారి అవకాశం లభించిందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలోని రహదారుల అభివృద్ధికి సుమారు రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదనంగా మరో రూ.100 కోట్లతో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు సుమారు రూ.50 కోట్లతో విద్యుత్ సంబంధిత పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా జెట్‌పోల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు సుమారు రూ.200 కోట్ల వ్యయం అవుతోందని, పనులను వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యా వ్యయాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలు విద్యపై చర్చించి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు సహకరించాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు సోలార్ యూనిట్లు, ఆర్టీసీ బస్సులు వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు.

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను వినియోగించుకునేలా టూరిజం శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు.

ఎంఆర్ఓ కార్యాలయ భవనాలతో పాటు మండలాల వారీగా సాంస్కృతిక భవనాలు, స్పోర్ట్స్ స్టేడియాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు అప్పుల భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

డ్రగ్స్ నిర్మూలనతో పాటు వివిధ సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంతో పాటు ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన విధానం వైపు నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు.

త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి 'ప్రభాతభేరి' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

ప్రజలు తమ ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు చేసుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సామాజిక కార్యక్రమాలు, ఫంక్షన్ల పేరుతో అవసరానికి మించి ఖర్చు చేయడం కుటుంబాలు అప్పుల పాలవడానికి ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలను పరిమిత వ్యయంతో నిర్వహించుకోవాలని సూచించారు. అనవసర ఖర్చులను నియంత్రించి పొదుపు అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవచ్చన్నారు.

ఆరోగ్యంపై ముందస్తుగా శ్రద్ధ వహించడం ద్వారా భవిష్యత్‌లో వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం, ఈత వంటి శారీరక, మానసిక ఆరోగ్య కార్యకలాపాలకు కేటాయించాలని సూచించారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా కుటుంబాలు అనవసర వైద్య వ్యయాలకు గురికాకుండా ఆర్థికంగా కూడా స్థిరంగా ఉండవచ్చని మంత్రి పేర్కొన్నారు.

సెల్‌ఫోన్, సోషల్ మీడియాను కేవలం వినోదానికి మాత్రమే పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి, వ్యాపార అవకాశాలను తెలుసుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

యువతతో పాటు మహిళలు కూడా డిజిటల్ వేదికలను ఉపయోగించుకుని కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని, ఉపాధి, వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కుటుంబ ఆదాయానికి అనుగుణంగా ఖర్చులకు ప్రాధాన్యతనిస్తూ, అనవసర వ్యయాలను నియంత్రించి పొదుపు చేయడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చని తెలిపారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్, విద్య, పర్యాటకం, క్రీడలు, గృహ నిర్మాణం, మహిళా సాధికారత తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.....,

కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంతో చైతన్యవంతులని, స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ అంశాలపై అవగాహనతో చర్చించే సామర్థ్యం వారికి ఉందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అన్నారు.

కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధిలో జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా, మంత్రిగా కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత అని చెప్పారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైతన్య కళా ప్రదర్శన ద్వారా కుటుంబ ఆర్థిక స్థిరత్వం, పొదుపు, బాధ్యతాయుత జీవనం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఎంపీ అన్నారు. ప్రజల్లో సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజల ఆకాంక్షలు, అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా పాలన అందించే ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేస్తోందని మల్లు రవి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడం ద్వారా ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని చెప్పారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో కుల గణన నిర్వహించి వివిధ వర్గాల జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర వివరాలను సేకరించామని ఎంపీ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు సామాజిక న్యాయ సాధనలో కీలకమైనవని తెలిపారు.

మహిళలు, రైతులు, యువత, పేదలు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ మల్లు రవి తెలిపారు. సాగునీరు, రవాణా తదితర రంగాల్లో రాష్ట్ర అవసరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను సాధించేందుకు సమన్వయం కొనసాగుతోందన్నారు.

ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధిని సమన్వయం చేస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం కొల్లాపూర్ నియోజక వర్గంలో మహిళా సంఘాలకు 175 కోట్లు రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

నియోజకవర్గం పరిధిలోని మండలాల మహిళా సంఘాల ఆధ్వర్యంలోని సంఘాల కు గొర్రె పిల్లను, నాటుకోడి పిల్లలను పంపిణీ చేశారు.

అంతకుముందు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు

తెలంగాణ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆడంబరాలకు పోయి అప్పుల పాలు కావద్దు అనే అంశంపై నాటికను ప్రదర్శించిన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి,సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలతో రాష్ట్రానికి నష్టం

-- జనసేన జిల్లా నాయకులు దోనె అశోక్



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర ఆరోపణలతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని జనసేన సిద్దిపేట జిల్లా నాయకులు, న్యాయవాది దోనె అశోక్ విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు.

+.ా. చీశీ. 22ాూతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ఇరు పార్టీల వైఖరితో రాష్ట్ర అభివృద్ధి వెనుకబడుతోందని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలతోనే సుపరిపాలన, గ్రామ స్వరాజ్యం సాధ్యమని దోనె అశోక్ పేర్కొన్నారు.

గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



వేములవాడ: సెప్టెంబర్5: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించి, తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తమకు నిత్యం మంచి చెడులు తెలియజేస్తూ, ఉన్నతమైన భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తున్న గురువులకు విద్యార్థులు శాలువాలు కప్పి, ప్రత్యేక బహుమతులు అందించి ఘనంగా సత్కరించారు.

పాఠశాల కరస్పాండెంట్ బుర ఉమా రమేష్ మాట్లాడుతూ... విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణంలో, వారి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడమే గురువులకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ మండల విద్యాధికారి కార్యాలయం ముందు బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బి ఎస్ ఎఫ్)



నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) సెప్టెంబర్ :5 నాగర్ కర్నూల్ మండల కేంద్రంలో మెరీడియన్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు భవన స్థాన చలన అనుమతి లేదని మరియు లిటిల్ విల్లె పాఠశాలకు అనుమతి లేదని ఫిర్యాదు చేసి రెండు నెలలు గడిచినా స్పందించడం లేదని వాపోయారు. విద్యాధికారులు తక్షణమే స్పందించి ఆ రెండు పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతా మన్నారు. విద్యాధికారులు నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.తక్షణమే స్పందించి ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు మద్దెలబండ సాయిబాబు, తాలూకా అధ్యక్షులు కాంపల్లి ఆంజనేయులు నాయకులు రాఘవేందర్, వరుణ్, శివ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపుపై నిఘా అవసరం

మండల కేంద్రం నుంచి బయటకు వెళ్తున్నట్లు సమాచారం.. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి

రాజవొమ్మంగి, రాజవొమ్మంగి మండల పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందుతున్న రేషన్ బియ్యం మండల కేంద్రం నుంచి బయట ప్రాంతాలకు తరలుతున్నట్లు సమాచారం అందుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు రేషన్ బియ్యం పంపిణీపై మాత్రమే కాకుండా పంపిణీ అనంతరం బియ్యం ఎటువైపు వెళ్తుందనే అంశంపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బియ్యం అక్రమంగా తరలుతున్నదా.. లేక లబ్ధిదారుల వద్ద నుంచి ఇతర మార్గాల్లో బయటకు వెళ్తున్నదా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. రేషన్ బియ్యం సేకరణ, నిల్వ, రవాణా జరుగుతున్న తీరుపై నిఘా పెంచడంతో పాటు అనుమానాస్పద వాహనాలపై తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' నేతృత్వంలో ప్రచారాన్ని ఐక్యరాజ్యసమితి చారిత్రాత్మక గ్లోబల్ డే ప్రకటనతో గుర్తించింది. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు



నాగర్ కర్నూల్ జిల్లా: ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లా లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయి ఉద్యమాన్ని నడిపిస్తున్న . కోనేరు ఎన్జీవో.., నవంబర్ 27వ తేదీని 'బాల్య, బాల్య దశలో జరిగే మరియు బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం'గా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతించింది. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు మరియు యంత్రాంగాలతో కలిసి పనిచేస్తున్న భారతదేశపు అతిపెద్ద స్వచ్ఛంద సంస్థల (కోనేరు ఎన్జీవో..,) నెట్‌వర్క్ అయిన 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' (జే ఆర్ సి) యొక్క అసాధారణ కృషికి ఈ ప్రకటన ఒక అంతర్జాతీయ గుర్తింపు అని ఆ సంస్థ పేర్కొంది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఒక ప్రత్యేక అంతర్జాతీయ దినోత్సవాన్ని ప్రకటించాలని ఏళ్ల తరబడి కృషి చేస్తున్న జస్ట్ ఫర్ రైట్స్ చిల్డ్రన్ కి . (కోనేరు ఎన్జీవో) ఒక భాగస్వామిగా ఉంది.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ...(కోనేరు ఎన్జీవో) డైరెక్టర్ (సలీం) మరియు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు ఇలా అన్నారు: "భారతదేశం నుండి వినిపించిన గళం శనివారం ఒక ప్రపంచ స్థాయి సంకల్పంగా మారింది. మన కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఎంతో గర్వకారణం. బాల్య వివాహాల నిర్మూలన కోసం ఒక అంతర్జాతీయ దినాన్ని పాటించేందుకు ఐక్యరాజ్యసమితి నవంబర్ 27వ తేదీని ఎంపిక చేసుకోవడం కూడా భారతదేశానికి ఎంతో గర్వకారణమైన విషయం.

సరిగ్గా ఇదే రోజున (2024లో), భారత ప్రభుత్వం జస్ట్ ఫర్ రైట్స్ చిల్డ్రన్ భాగస్వాములతో కలిసి 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' (బాల్య వివాహ రహిత భారత్) ప్రచారాన్ని ప్రారంభించింది. అయితే, ఇది కేవలం సంబరాలు చేసుకుని ఆగిపోయే సమయం కాదు."

ప్రపంచవ్యాప్త నిబద్ధతను క్షేత్రస్థాయిలో ఆచరణలోకి తీసుకురావడమే ఇప్పుడున్న అసలైన సవాలు అని వారు పేర్కొన్నారు. "మా జిల్లాలోని ఏదో ఒక గ్రామంలో కనీసం ఒక్క బిడ్డ అయినా బాల్య వివాహ ముప్పులో ఉన్నంత కాలం, మా పోరాటం అసంపూర్ణంగానే ఉంటుంది. కేవలం చట్టాల ద్వారా మాత్రమే బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టలేమని మాకు తెలుసు. అందుకే మేము పాఠశాలలు, పంచాయతీలు మరియు గ్రామాల్లో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలను చేపట్టాము. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేసేలా ప్రజలను ప్రోత్సహించాము, బాల్య వివాహ ముప్పు ఉన్న ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానించాము, అలాగే బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేశాము." ...(కోనేరు ఎన్జీవో) సంస్థ చట్టపరమైన చర్యల ద్వారా ...(జిల్లా పేరు)లో ...(సంఖ్య) బాల్య వివాహాలను అడ్డుకుంది.

జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు, బాల్య వివాహాలను అంతం చేయడానికి ఒక ప్రత్యేక ప్రపంచ దినోత్సవం కోసం అంతర్జాతీయ పిలుపును ప్రారంభించారు. మార్చి 2026లో, ఐక్యరాజ్యసమితిలో తన ప్రసంగంలో, ఆఫ్రికా దేశమైన సియెర్రా లియోన్ ప్రథమ మహిళ డాక్టర్ ఫాతిమా మాదా బయోతో సహా అంతర్జాతీయ నాయకుల సమక్షంలో, భువన్ రిభు ఐక్యరాజ్యసమితి తీర్మానం కోసం చేసిన పిలుపును పునరుద్ఘాటించారు. ఆమె కూడా ఈ చొరవకు మద్దతు తెలిపారు. తదనంతరం, భారతదేశంతో సహా సుమారు 67 దేశాల మద్దతుతో సియెర్రా లియోన్, బాల్య వివాహాలను అంతం చేయడానికి అంకితమైన ప్రపంచ దినోత్సవంగా నవంబర్ 27ని ప్రకటించాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి ఒక తీర్మానాన్ని సమర్పించడం ద్వారా ఈ ప్రయత్నానికి నాయకత్వం వహించింది. సెప్టెంబర్ 4న, ఐక్యరాజ్యసమితి ఈ తీర్మానాన్ని ఆమోదించింది.

జస్ట్ రైడ్స్ ఫర్ చిల్డ్రన్ అనేది పిల్లల రక్షణకు సంబంధించిన ప్రపంచంలోని అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటి. తన 'బాల్య వివాహ రహిత ప్రపంచం'ప్రచారంలో భాగంగా, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఒక ప్రపంచవ్యాప్త ఉద్యమాన్ని నిర్మించడానికి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కృషి చేస్తోంది. భారతదేశంలో, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్య సంస్థలు అనేక రాష్ట్రాలు మరియు 782 జిల్లాలలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ, ఈ ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాలకు మరియు దుర్బల సమూహాలకు తీసుకువెళుతున్నాయి. బాల్య వివాహాలను నిరోధించేందుకు, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్య సంస్థలు మరియు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్, సోషల్ వర్కర్ శివుడు తదితరులున్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణకు ఘనంగా ఆహ్వానం

సోమవారం ఉదయం 08:00 గంటల నుంచి ప్రత్యేక పూజలు

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్ళ గ్రామంలో సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థాన శంకుస్థాపన మహోత్సవానికి హాజరు కావాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్‌ను ఆహ్వానించారు. శనివారం జిల్లా అధ్యక్షుడిని ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శంకుస్థాపన అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉదయం 08:00 గంటల నుండి కార్యక్రమాలు

సోమవారం ఉదయం నుంచే ఆలయ నిర్మాణ ప్రాంగణంలో వేదోక్తంగా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 08:00 గంటలకు మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 09:30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా శంకుస్థాపన మహోత్సవం జరగనుంది. ఈ ఆహ్వాన కార్యక్రమాల్లో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోట్లపల్లి గోపి, తనికెళ్ల చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ మెట్టుపల్లి శ్రీనివాసరావు, తనికెళ్ళ గ్రామ ఉప సర్పంచ్ చల్లా నరసింహారావు, జర్నలిస్ట్ భరత్ తివారి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరగనున్న ఈ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మెట్‌పల్లిలో ఇంధన కొరత.. పెట్రోల్, డీజిల్ లేక వాహనదారుల అవస్థలు



మెట్‌పల్లి, సెప్టెంబర్ 5 (తెలంగాణ పవర్): మెట్‌పల్లి పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ రెండూ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంధనం కోసం బంక్‌కు వచ్చిన ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. బంక్ వద్ద పెట్రోల్ అందుబాటులో లేదని 'చీూ ్రాజు=ూూ' బోర్డు ఏర్పాటు చేయగా, డీజిల్ కూడా లేకపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాలు, అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే వాహనదారులు ఇంధనం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అసలు పెట్రోల్, డీజిల్ సరఫరా ఎందుకు నిలిచిపోయింది..? ఇంధన నిల్వలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి..? మెట్‌పల్లి పట్టణంలోని ఇతర పెట్రోల్ బంక్‌ల పరిస్థితి ఏంటి..? అనే ప్రశ్నలు వాహనదారుల్లో తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఇంధన కొరతకు గల కారణాలను వెల్లడించి, పెట్రోల్, డీజిల్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

- సామాజిక విలువలు, క్రమశిక్షణపై బోధించాలి
- విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వేములవాడ, సెప్టెంబరు 5: విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు సామాజిక విలువలు, కట్టుబాట్లు, క్రమశిక్షణపై బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులపై అత్యంత ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి, వారిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇప్పటికే 11 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులే విద్యార్థులకు రోల్ మోడల్స్ అన్నారు. ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు అందించిన సేవలను అభినందించారు.

కేబినెట్ బెర్తుల భర్తీ ఎప్పుడు

హైదరాబాద్, సెప్టెంబర్ 5, (న్యూస్ పల్స్) తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టానికి తెరలేపుతోంది. మంత్రివర్గంలో మార్పుచేర్పులు ,ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తుది అనుమతి లభించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగియగానే ఈ విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ పరిణామం కేవలం పదవుల పెంపకానికే పరిమితం కాకుండా, పార్టీపై , పాలనపై సీఎం తన పట్టును మరింత బిగించే ప్రక్రియగా కనిపిస్తోంది.ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సాంకేతికంగా ఖాళీలు ఏర్పడగా, కొండా సురేఖ బర్తరఫ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రాతినిధ్యంతో పాటు బీసీ మహిళా స్థానం ఖాళీ అయింది. అంటే ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో పాటు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాతినిధ్యాన్ని కల్పించడం సీఎం రేవంత్ ముందున్న ప్రధాన లక్ష్యం. మూడేసి ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, పనితీరు సరిగ్గా లేని కొంతమంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారి స్థానంలో నూతన ముఖాలకు అవకాశం కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రణాళిక సిద్ధమైంది.కొండా సురేఖను తప్పించిన వెంటనే, నష్ట నివారణ చర్యల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ముగ్గురు కీలక బీసీ మహిళా నేతలకు ఉన్నతమైన నామినేటెడ్ పదవులను కట్టబెట్టడం ద్వారా తన సామాజిక వ్యూహాన్ని చాటుకున్నారు. కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మి , మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద , కుడా ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి లను నియమించడం ద్వారా బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశామనే సంకేతాన్ని పంపించారు. ఇదే సూత్రాన్ని రాబోయే కేబినెట్ భర్తీలోనూ పాటిస్తూ ఒక బీసీ మహిళకు మంత్రిపీఠం దక్కేలా రేవంత్ ప్రణాళికలు రచిస్తున్నారు.మరోవైపు, పాత కాంగ్రెస్ నేతలు , కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల మధ్య సమన్వయం పాటించడం ఈ కేబినెట్ విస్తరణలో రేవంత్ రెడ్డికి ఎదురుకానున్న పెద్ద పరీక్ష. పార్టీ కోసం మొదటి నుంచీ కష్టపడిన సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అధిష్టానంతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగిస్తూ దిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నారు. అయితే, మంత్రివర్గంలో కేవలం రాజకీయ సమీకరణాలే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు మరియు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి ఉపయోగపడే డైనమిక్ నాయకులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విస్తరణ ద్వారా రేవంత్ రెడ్డి కేవలం ఖాళీలను పూరించడమే కాకుండా, పనితీరు సరిగ్గా లేని మంత్రులకు హెచ్చరిక పంపేలా పెర్ఫార్మెన్స్ బేస్డ్ ప్రక్షాళన చేయనున్నారు. ఐటీ, రెవెన్యూ, నీటిపారుదల వంటి కీలక శాఖలు తప్ప మిగిలిన శాఖల్లో పనితీరును సమీక్షించి, సమర్థులైన అధికారులకు మరియు మంత్రులకు తగిన రీతిలో పోర్ట్‌ఫోలియోలను పునర్విభజించే అవకాశం ఉంది. ఈ దిశగా ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా పూర్తవ్వడం పాలనాపరమైన మార్పులకు సంకేతంగా నిలుస్తోంది.రాబోయే కేబినెట్ విస్తరణ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఒక రకమైన పొలిటికల్ రీసెట్ కాబోతోంది. అంతర్గత అసమ్మతికి తావులేకుండా, సామాజిక న్యాయాన్ని కాపాడుతూ, నామినేటెడ్ పదవులు , కేబినెట్ బెర్తులను ఒకేసారి భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వంపై మరియు కాంగ్రెస్ క్యాడర్‌పై తన అజమాయిషీని రేవంత్ రెడ్డి మరోసారి నిరూపించుకోనున్నారు.

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి రేవంత్ ?



సూర్యాపేట, సెప్టెంబర్ 5 : 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అంటూ ఆచరణకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అన్ని వర్గాలతో పాటు విద్యార్థులను మోసం చేశాడని విద్యార్థులు, యువత, నిరుద్యోగులు నినదించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎక్కడ, విద్యార్థులకు స్కూటీలు ఎక్కడ, యువతకు ఉద్యోగాలు ఎన్ని ఇచ్చావంటూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, యువత, నిరుద్యోగులు నిరసన ర్యాలీ తీశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ ముదిరెడ్డి అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎర్రటి ఎండలో సుమారు 5 కిలోమీటర్ల మేర వెయ్యి మంది విద్యార్థులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వాణిజ్య భవన్ వద్ద విద్యార్థుల, యువతను ఉద్దేశించి మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 16, 978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. నిరుద్యోగులకు నెలకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా నిరుద్యోగులకు రూ.40 వేల 920 కోట్లు బాకీ పడ్డాడని తెలిపారు.నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న అబద్ధాల మాటలు ఇక ఆపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని చెబితే వారు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని నేటికీ స్కూటీల జాడలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.9 వేల కోట్ల బకాయిలు ఉంటే ఇవ్వకపోవడతో విద్యార్థిలు, తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్ల కేటాయించి అభివృద్ధి చేస్తామన్నావు ఎక్కడా అభివృద్ధి అని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్ ఎక్కడ ఉంది, ప్రతి విద్యార్థికి విద్యా భరోసా కింద రూ.5 లక్షల కార్డు ఏదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ముదిరెడ్డి అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులు విద్యార్థిని విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అసెంబ్లీలో తమ నాయకులు కేసీఆర్ కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్ రెడ్డి అండగా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. రెండేళ్లలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ మనందరి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లట్లపల్లి శోభన్ బాబు, నాయకులు కీసర వేణుగోపాల్, బొడ్డు కిరణ్, సోమగాని వేణు గౌడ్, చామకూరి మహేందర్, సునీల్, సందీప్, శివ, నెల్లుట్ల ఉపేందర్, మహేష్, స్పందన, మౌనిక, హాసిని పాల్గొన్నారు

కోవిడ్ టీకాలతో 28 మంది సైనికులు మృతి: అమెరికా ఆర్మీ డాక్టర్



న్యూయార్క్: కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల 28 మంది సైనికులు మృతిచెందినట్లు ఓ అమెరికా ఆర్మీ డాక్టర్ కోర్టులో తెలిపారు. దీనిపై పొలిటికో వార్తాసంస్థ ఓ కథనాన్ని రాసింది. కోవిడ్ టీకా వల్ల సుమారు 2544 మంది మృతిచెందిన ఘటనలో అమెరికా ప్రభుత్వం దర్యాప్తు చేపడుతున్నది. అమెరికా ఆరోగ్యశాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్‌కు అడ్వైజర్‌గా చేస్తున్న థెరిసా లాంగ్ ఈ విషయాన్ని వర్జీనియా కోర్టులో చెప్పినట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ అడ్వర్స్ ఈవెంట్ రిపోర్టింగ్ సిస్టమ్‌కు సుమారు 2544 మృతుల సమాచారం అందినట్లు లాంగ్ తన వాంగ్మూలంలో వెల్లడించారు.మిలిటరీ సిబ్బంది కోవిడ్ టీకా తీసుకోవాలని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశించారు. లేదంటే విధుల నుంచి తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కోవిడ్ టీకా తీసుకోని 9వేల మందిని తొలగించారు. ఇక దేశాధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఆ తొలగించిన సైనికులను మళ్లీ విధుల్లో చేర్చుకున్నారు. ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ ద్వారా కోవిడ్19 టీకాను వేగంగా, భారీ స్థాయిలో ఉత్పత్తి చేశారు. అయితే తమ వ్యాక్సిన్ల వల్ల స్వల్ప స్థాయిలో గుండె కణజాలం వాపునకు గురయ్యే అవకాశాలు ఉన్నట్లు ఫైజర్, మోడెర్నా సంస్థలు పేర్కొన్న విషయం తెలిసిందే.

'ఉపాధ్యాయులు ఉత్తమ సామాజిక నిర్మాతలు'

చుంచుపల్లి, సెప్టెంబర్ 05 : ఉపాధ్యాయులు ఉత్తమ సామాజిక నిర్మాతలని, దేశ అభివృద్ధికి పునాది వేసే కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యానగర్‌లోని అసోసియేషన్ భవనంలో విశ్రాంత ఉపాధ్యాయులు దేవరపు వెంకటేశ్వరరావు, చింతలపూడి వెంకన్నను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ప్రసాద్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడులు.. ఆయిల్ ట్యాంకర్‌పై దాడి చేసిన యూఎస్

అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి చేసింది. ఖర్గ్ ఐలాండ్ వద్ద ఉన్న ఒక ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా మిస్సైల్ దాడి చేసింది. ఇరాన్ తీరానికి ఖర్గ్ ఐలాండ్ 33 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇరాన్ నుంచి చమురు రవాణాకు ఈ దీవి చాలా కీలకం. ఇక్కడినుంచే క్రూడాయిల్‌ను ఇరాన్.. విదేశాలకు తరలిస్తుంది.అందుకే, అమెరికా.. ఈ దీవిని లక్ష్యంగా ఎంచుకుని దాడి చేస్తోంది. ఇరాన్‌పై దాడి చేస్తామని శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌లోని పిక్కేక్స్ పర్వత ప్రాంతంలో ఉన్న భూగర్భ అణు కేంద్రంపై దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధం తయారు చేయకుండా నిరోధించాలనేదే తమ లక్ష్యమని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఈ వార్నింగ్ ఇచ్చిన తర్వాత కొన్ని గంటల్లోనే ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా నాలుగు మిస్సైళ్లతో దాడి చేసింది. ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి.తాజా దాడికి సంబంధించి జరిగిన నష్టంపై ఎలాంటి ప్రకటనా రాలేదు. అటు అమెరికా.. ఇటు ఇరాన్.. ఈ దాడిపై ఇంకా స్పందించలేదు. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని అలి తాహెర్ ప్రాంతాన్ని 'ఆపరేషన్ కంట్రోల్' ద్వారా అధీనంలోకి తెచ్చుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లాకు చెందిన భూగర్భ స్థావరాలు, ఆయుధ భాండాగారం వంటివి ఈ ప్రాంతంలోనే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం : మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.పద్మారావు నగర్ లో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతుందని ఆరోపించారు. జీవో 97 తీసుకొచ్చి పాలిటెక్నిక్ విద్యార్థులను రోడ్లపైకి తీసుకొచ్చిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన ఆస్తుల కోసం ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని పేర్కొన్నారు. పరిపాలన చేతగాక, పాలనను గాలికొదిలేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి రిబ్బన్ లు కట్ చేస్తున్నారని వెల్లడించారు.



22ఏ అనేది గుంపు మేస్త్రి అనాలోచిత నిర్ణయం

ఎంపి రఘునందన్ రావు

సంగారెడ్డి ,పటాన్ చెరు నియోజకవర్గంలోని సింపొని పార్క్ హోమ్స్ కాలనీలో 22 ఏ పై ప్రత్యేక చర్చా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, స్థానిక నాయకులు హజరయ్యారు. సింపొని పార్క్ హోమ్స్ కు సంబంధించిన 15వందల ఇళ్లను నిషేదిత జాబితాలో పెట్టడంపై కాలనీ వాసుల ఆవేదన వ్యక్తం చేసారు. కాలనీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు.యం పి రఘునందన్ మాట్లాడుతూ 22ఏ అనేది గుంపు మేస్త్రి అనాలోచిత నిర్ణయం . ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లకు అన్ని అనుమతులున్నా 22ఏ పెట్టడం దుర్మార్గం . అర్ధరాత్రి ఆనాలోచిత నిర్ణయాలకు ఎందరో నాశనమవుతున్నారు. చేసిందంతా చేసి సారీ చెబితే సరిపోతుందా. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి చేసిన పెద్ద తప్పిదం 22ఏ . 22ఏ లో ప్రైవేటు భూములను ఖచ్చితంగా నిషేదిత జాబితాలో నుంచి తీసి వేసేందుకు ప్రయత్నం చేస్తా నని అన్నారు.సింపొని పార్క్ హోమ్స్ కాలనీ లో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా. గుంపు మేస్త్రి చేసిన 22ఏ తప్పును సోషల్ మీడియా ద్వారా బహిర్గతం చేసేలా యువతరం పోస్టులు పెట్టండి. కాంగ్రెస్ పాలనలో పేదోడి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయమా . ఏదో చిన్న మాటన్నందుకు కొండా సురేఖ ను బర్తరఫ్ చేస్తే.. పెద్ద తప్పులు చేస్తున్న సీయం రేవంత్ రెడ్డి ని ఎందుకు తీసేయటం లేదు. ప్రభుత్వ దిగి వచ్చే వరకు 22ఏ పై పోరాటం చేయాలని అన్నారు.

ఉపాధ్యాయులందరికీ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కు నివాళులు

హైదరాబాద్ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆ మహనీయునికి నివాళులు అర్పించారు.జ్ఞానాన్ని, వివేకాన్ని అందిస్తూ నిత్యం స్ఫూర్తినిస్తూ, మార్గనిర్దేశం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల పాత్ర అమూల్యం. తరగతి గదుల్లో విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంతో పాటు, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయం. దేశ ప్రగతికి బాటలు వేసే గురువుల జ్ఞానం, మార్గదర్శనం, అంకితభావం, స్ఫూర్తి.. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలి" అని ఆకాంక్షించారు.

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్.. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ..



కాంగ్రెస్ 1000 రోజుల విఫలపాలనపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చి అమలు చేయకపోవడంపై పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై నిరసన తెలిపేందుకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలో బీఆర్ఎస్ ధర్నాకు వెళ్తుండగా పట్నం నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ నేతల పట్ల పోలీసుల దౌర్జన్యం ఎలా ఉందో తాజా వీడియో చెప్పకనే చెబుతోంది.హనుమకొండ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ విఫల పాలనకు నిరసనగా విద్యార్థులతో కలిసి భీమారం నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు భారీ ర్యాలీ చేపట్టారు. బీఆర్ఎస్‌కు వస్తున్న మద్దతు తట్టుకోలేక కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో హసన్‌పర్తి మండలం భీమారం వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ శ్రేణుల దాడిని ప్రతిఘటించాయి. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు గొడవను సద్దుమణిగించేందుకు ప్రయత్నించారు. ఇదేం రాజ్యం ఇదేం రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడి రాజ్యం.. పోలీసు ఝులుం నశించాలి అంటూ బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి.కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై నిరసన తెలిపేందుకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఉపాధ్యాయులను సన్మానించిన సైబరాబాద్ సీపీ

కొండాపూర్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం గచ్చిబౌలిలోని జెడ్‌పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సైబరాబాద్ సీపీ (డాక్టర్ ఎం రమేష్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన హెచ్ఎం రెహానా బేగం, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌లను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఓటీపీ, బ్యాంకు వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని, సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్‌వో భూపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ఏడిపించే ఏ రాజ్యం బాగుపడదు.. రేవంత్ సర్కారుపై బండి సంజయ్ ఫైర్



హైదరాబాద్ : ఉపాధ్యాయులతో కన్నీళ్లు పెట్టించే ఏ రాజ్యం బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు గ్రహించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు.రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని బండి సంజయ్ కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని స్పష్టంచేశారు.

నేపాల్ టన్నెల్‌లో సజీవంగా చైనీస్ దేశస్థుడు.. శిథిలాల కింద ప్రాణాలతో 64 ఏళ్ల మహిళ



కాట్మాండు: నేపాల్‌లో వరదల్లో చిక్కుకున్న మరో ఇద్దర్ని ఇవాళ రక్షించారు. త్రిశూలీ టన్నెల్ నుంచి ఓ చైనీస్ దేశస్థుడిని కాపాడారు. వరదలు సంభవించిన పది రోజుల తర్వాత ఆ చైనా దేశస్థుడు టన్నెల్‌లో సజీవంగా ఉన్నాడు. చికిత్స కోసం అతన్ని కాట్మాండుకు తరలించినట్లు నేపాలీ ఆర్మీ ప్రకటించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న జలవిద్యుత్తు టన్నెల్‌లో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు భారీ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. సుమారు 900 మంది కార్మికులు వివిధ టన్నెల్స్‌లో ఉండి ఉంటారని భావిస్తున్నారు. ఆగస్టు 26వ తేదీన సంభవించిన నేపాల్ జల విలయంలో సుమారు 1300 మంది ప్రాణాలు కోల్పోయారు, మరో 5 వేల మంది మిస్సింగ్ అయ్యారు.భారత, నేపాలీ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నాయి. శుక్రవారం 9వ రోజు ఇద్దరు నేపాలీ దేశస్థులను త్రిశూలీ టన్నెల్ నుంచి సజీవంగా రక్షించిన విషయం తెలిసిందే.నువాకోట్ పట్టణంలో పూర్తిగా దెబ్బతిన్న ఓ ఇంటి నుంచి ఓ మహిళను కూడా నేపాల్ ఆర్మీ రక్షించింది. 64 ఏళ్ల చండికా శ్రేష్ఠ అనే మహిళ ఆ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. బేత్రావతిలో ఇంటి శిథిలాల కింద నుంచి ఆమెను సురక్షితంగా బయటకు తీశారు. ఆ మహిళ మొత్తం బురదతో నిండిపోయింది.

ముస్లింలకు ఇక మతస్వేచ్ఛ వర్తించదా..? : అసదుద్దీన్ ఒవైసీ

ఉత్తరప్రదేశ్ లోని సహరాన్‌పూర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మసీదు కూల్చివేతపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ ఇక వర్తించదా..? అని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు మసీదును కూల్చివేసినట్లు తెలిపారు. మసీదు ఉనికిని నిరూపించే 1911 నాటి రికార్డులు కమిటీ వద్ద ఉన్నాయని ఓవైసీ చెప్పారు.శతాబ్దానికిపైగా అక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయని ఒవైసీ తెలిపారు. ఇది 'వక్ఫ్ బై యూజర్' పరిధిలోకి వస్తుందని చెప్పారు. ఏళ్ల తరబడి అక్కడ ప్రార్థనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పుడు ఆ భూమిపై హక్కు ఎలా కోరుతుందని ఓవైసీ ప్రశ్నించారు. 'మసీదు ముందే ఉంది.. కలెక్టరేట్ ఆ తర్వాత వచ్చింది' అని వ్యాఖ్యానించారు. మసీదును కూల్చేందుకు బుల్డోజర్ ఉపయోగించడాన్ని తప్పుబట్టారు. 'నా మత స్వేచ్ఛ మీ దయపై ఆధారపడి లేదు' అని స్పష్టంచేశారు.కోర్టు ఆదేశాల మేరకే కూల్చివేత చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మసీదును ప్రభుత్వ భూమిపై ఉన్న అక్రమ నిర్మాణంగా కోర్టు గతంలో ప్రకటించింది. ముస్లిం పక్షం దాఖలు చేసిన అప్పీల్‌ను జిల్లా న్యాయస్థానం శుక్రవారం తిరస్కరించింది. దాంతో శనివారం భారీ భద్రత మధ్య కూల్చివేత చేపట్టారు. ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగింది. సహారన్‌పుర్ వెళ్లేందుకు సిద్ధమైన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్‌ను పోలీసులు ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఆమె నివాసం వద్ద భారీగా బలగాలను మోహరించారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ కూడా కూల్చివేతను తప్పుబట్టారు. భూమి రికార్డులు, వక్ఫ్ బోర్డు అంశాలను ఆయన ప్రస్తావించారు. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ పరిణామంతో పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.



'వారంతా కలిసి కాంగ్రెస్‌ను బొంద పెట్టడం ఖాయం'

ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, రాంచందర్ నాయక్
హాలియాలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ

హాలియా, సెప్టెంబర్ 05 : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలన విద్యార్థి, యువత, నిరుద్యోగులను దగా చేసిందని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ గత శాసనసభ ఎన్నికల్లో యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ హాలియాలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రామాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఇప్పటికీ నిరుద్యోగ భృతి చెల్లించకపోగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో కూడా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ గానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ గాని విడుదల చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్ వెయ్యకుండా నిరుద్యోగ భృతిని చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. విద్యార్థినీలకు స్కూటీలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి అవి కూడా ఇప్పటికీ పంపిణీ చేయలేదని తెలిపారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి, యువత, నిరుద్యోగులను మోసం చేసిందని దుయ్యబట్టారు. విద్యార్థి, యువత, నిరుద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో గానీ దేశంలో గానీ మనుగడ సాగించిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విద్యార్థి, యువత, నిరుద్యోగులు ఆగ్రహంతో ఉన్నారని, వారంతా కలిసి భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని పేర్కొన్నారు.



హైదరాబాద్ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు ప్రభుత్వ నిధులు: దానం నాగేందర్



హైదరాబాద్, సెప్టెంబర్ 5: నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలు ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకునేందుకు 30 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ట్రాఫిక్, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తరఫున కూడా ఉత్సవాల ఏర్పాట్ల కోసం అవసరమైన నిధులను కేటాయిస్తామని దానం నాగేందర్ పేర్కొన్నారు.ఈసారి సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం ఖైరతాబాద్ గణేశ్ ఆగమన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. గణేశ్ విగ్రహ తయారీ కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన.. అయితే చవితికి రెండు రోజుల ముందుగానే భక్తులకు గణేశుడి దర్శనం కల్పించేలా నిర్విరామంగా పనులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. విగ్రహ తయారీతో పాటు మండపం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. భారీ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు దానం నాగేందర్ వెల్లడించారు.

విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కొరకు నిరసన ర్యాలీ- రావుల శ్రీధర్ రెడ్డి

ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామంటూ మోతీ నగర్ లో సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపు లో జరుగుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా భారీ ర్యాలీ ని చేపట్టారు.ర్యాలీ లో బి.ఆర్.ఎస్ నాయకులు మాజీ సాప్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రియంబర్స్మెంట్ ను బదిలీ చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ చేసే ఈ అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో బహిర్గతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన ర్యాలీలలో భాగంగా భారీగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థులు తమకు జరిగే అన్యాయాన్ని ఎదురించి విద్యార్థి దశ నుండే పోరాట పటిమ అలవర్చుకోవలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థులకు అన్ని విధాలుగా బిఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు.ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

బెంగళూరులో దారుణం.. అప్పు తీర్చలేదని మహిళను వివస్త్రను చేసి..



కర్ణాటకలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. అప్పు కట్టలేదన్న కోపంతో మహిళపై ఘాతుకానికి ఒడిగట్టారు కొందరు వ్యక్తులు. మహిళను వివస్త్రను చేసి కొట్టారు. ఈ దారుణాన్ని సెల్‌ఫోన్‌లో వీడియో కూడా చిత్రీకరించారు. అప్పు తీర్చకపోతే వీడియోను ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించారు. మహిళపై దాడి చేసిన నలుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన బాధితురాలు.. రేష్మ అనే మహిళ నుంచి కొన్ని నెలల క్రితం 50 వేల రూపాయల అప్పు తీసుకుంది.ప్రతినెల 5 వేల రూపాయలు చెల్లించేది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ నాలుగు వారాల పాటు ఆమె డబ్బులు కట్టలేదు. రేష్మ తనను వేధిస్తుందేమోనని భయపడిపోయిన బాధితురాలు.. రేష్మ ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేయటంతో పాటు వేరే ఇంటికి మారిపోయింది. రెండు రోజుల క్రితం నజ్రత్ అనే మహిళ బాధితురాలికి ఫోన్ చేసింది. పనితో పాటు కొంత డబ్బు కూడా ఇప్పిస్తానని చెప్పింది. బాధితురాలు నజ్రత్ ఇంటికి వెళ్లగా.. సొహైల్ అనే వ్యక్తి బాధితురాలిపై దాడి చేశాడు.నజ్రత్, సోహైల్, రేష్మ, సైఫ్.. బాధితురాలిని కుంబల్‌గోడులోని ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను వివస్త్రను చేసి తీవ్రంగా కొట్టారు. ఈ దారుణాన్ని వీడియో తీశారు. వీలైనంత త్వరగా డబ్బులు కట్టకపోతే వీడియోను ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించారు. బాధితురాలి తల్లి ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. 8 మంది దుర్మరణం..



తిరువనంతపురం, సెప్టెంబర్ 5: కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపక్క ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో 8 మంది మృతి చెందారు. శుక్రవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు కారులో కేరళ పర్యటనకు వచ్చారు. గురువాయూర్ పర్యటన ముగిసిన తర్వాత కొడుంగలూర్ వైపు బయలు దేరారు. శుక్రవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది.వారు ప్రయాణిస్తున్న కారు త్రిస్సూర్ జిల్లాలోని కైపమంగలం వద్ద హైవేపై ప్రమాదానికి గురైంది. రోడ్డుపక్క ఆగి ఉన్న ఓ లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఫైర్, రెస్క్యూ, పోలీసు సిబ్బందితో పాటు స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎనిమిది మృతదేహాలను కారునుంచి బయటకు తీశారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం త్రిస్సూర్ మెడికల్ కాలేజ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వంట విషయంలో గొడవ.. భార్యను కొట్టి చంపిన భర్త..

వంట విషయంలో గొడవ కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. ఓ భర్త తన భార్యను దారుణంగా కొట్టి చంపేశాడు. ఈ సంఘటన మహారాష్ట్రలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగ్‌పూర్‌కు చెందిన 41 ఏళ్ల కృష్ణలాల్ యాదవ్, యామిని కృష్ణలాల్ యాదవ్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం కృష్ణలాల్ పని ముగించుకుని ఇంటికి వచ్చాడు. తన కోసం, పిల్లల కోసం వంట చేయమని అడిగాడు. డ్యాన్స్ క్లాస్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్న ఆమె వంట చేయడానికి ఒప్పుకోలేదు.దీంతో ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. ఆ గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. మద్యం మత్తులో ఉన్న కృష్ణలాల్ భార్యపై విరుచుకుపడ్డాడు. ఆమె గొంతు, పొత్తి కడుపుపై బలంగా దాడి చేశాడు. దెబ్బల కారణంగా యామిని విలవిల్లాడింది. గొంతు, కడుపు విపరీతంగా నొప్పి తీస్తున్నాయని భర్తకు చెప్పింది. నొప్పుల మాత్రలు తీసుకురమ్మని అడిగింది. కృష్ణలాల్ మెడికల్ స్టోర్‌కు వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చాడు. ఓ గంట తర్వాత యామిని ఆరోగ్య పరిస్థితి దారుణంగా దిగజారింది.కడుపు లోపలి అవయవాలకు గాయాలు అవ్వటంతో యామిని కడుపు బాగా ఉబ్బిపోయింది. భర్త ఆమెను ఆస్పత్రికి తరలించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యామిని ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. యాక్సిడెంటల్ డెత్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యామిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టులో.. బలమైన గాయాల కారణంగా యామిని గొంతు ఎముక విరిగిందని, కడుపులో పేగులు తీవ్రంగా దెబ్బ తిన్నాయని తేలింది. దీంతో పోలీసులు కేసును మర్డర్ కేసుగా మార్చి, యామిని భర్తను అరెస్ట్ చేశారు.



సుదీర్ఘ పాదయాత్రకు జగన్



కడప, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే. ప్రతిపక్ష నేతగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను, విశ్వసనీయతను చూపించగలిగితేనే పాదయాత్ర సక్సెస్ అవుతుంది. పాత ఫార్ములానే నమ్ముకోకుండా, సరికొత్త హామీలతో, పొరపాట్లను సరిదిద్దుకుంటూ జగన్ ప్రజల్లోకి వెళితేనే ఈ పాదయాత్ర 2.0 వైసీపీని మళ్లీ రేసులోకి తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి

ద్వారంపూడిపై ప్రభుత్వం దృష్టి

కాకినాడ, సెప్టెంబర్ 5, కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ట్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

జనాల్లోకి జై కొట్టు నినాదం

విజయవాడ, సెప్టెంబర్ 5, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ యువ ఓటర్లపై కన్నేశారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు.. రానున్న ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటర్లను ఆకట్టుకోవాలన్న లక్ష్యంగా జనసేన పనిని ప్రారంభించింది. ఇందులో భాగంగా జనసేన యువజన విభాగాన్ని ఆర్భాటంగా పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నాడు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా జెన్ జీ ఫీవర్ అన్ని రాజకీయ పార్టీలను పట్టిపీడిస్తుంది. అందులో భాగంగా జనసేన కూడా యువత ఓట్ల కోసం వేట ప్రారంభించింది. పవన్ కల్యాణ్ పై గత రెండేళ్ల నుంచి ఎలాంటి అవినీతి ముద్ర పడలేదు. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సజావుగా, సమర్థవంతంగా చేస్తున్నారన్న ప్రశంసలను కూడా అందుకుంటున్నారు. అవినీతి మరక అంటకుండా ఉన్న తనకు అండగా నిలబడాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నారు. యువత అండగా నిలిస్తే విజయం నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు.ఇలాగే తన వైఖరిని కొనసాగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేనకు కూటమిలో పొత్తులో భాగంగా అత్యధిక స్థానాలను పొందవచ్చు. యువ నేతలకు పోటీకి అవకాశమిస్తే ప్రజల నుంచి కూడా ఆదరణ లభించే ఛాన్స్ ఉంది. కేవలం కాపు సామాజికవర్గానికి చెందిన ఓటర్ల పైనే ఆధార పడకుండా యువ ఓటర్లను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. పవన్ కల్యాణ్ కేరళ నుంచి తిరిగి వచ్చిన వెంటనే యువతతో ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింతగా ఎదిగే అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. యువత, మహిళ ఓటర్లను ఆకట్టుకోగలిగితే ఇక తనపై సామాజికవర్గం ముద్ర పడకపోయినా పెద్దగా ఉండదని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జైకొట్టు నినాదంతో... జనసేన పార్టీ యువతను, ముఖ్యంగా 'జెన్-జీ' ని ఆకట్టుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తోంది.'జై కొట్టు' యువజన విభాగంపవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పిఠాపురంలో జనసేన తొలిసారిగా ప్రత్యేక యువజన విభాగాన్ని ఆవిష్కరించింది.'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' స్ఫూర్తితో ఈ విభాగానికి 'జై కొట్టు' అని పేరు పెట్టారు.జెన్-జీ యువతను రాజకీయాల్లోకి, సామాజిక కార్యక్రమాల్లోకి భాగస్వామ్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. నేటి తరానికి తగినట్లుగా ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సంభాషణలు సాగించనున్నారు.సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో యువత అయితే మరింత పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలుగుతారన్న నమ్మకంతో ఉన్నారు. మొత్తం మీద జనసేన ఇప్పుడు జెన్ జీ ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహంతో పవన్ కల్యాణ్ ముందుకు వెళుతున్నారు. మరి పవన్ జెన్ జీ వ్యూహం ఎంత మేరకు ఫలిస్తుందన్నది చూడాలి.

నెల్లూరు జిల్లా వాసి ఒంగోలులో లాక్ అప్ డెత్ !

ఒంగోలుఒంగోలు పోలీసుల లాకప్లోనే తన కుమారుడ్ని చంపేశారని బాధిత తల్లి కన్నీరు పెడుతోంది. పొలాల్లో దివ్యతేజ మృతదేహం లభ్యం అయింది. బోగోలు మండలంకు చెందిన దివ్య తేజను పోలీసులే హతమార్చారని తల్లి, సోదరి ల ఆరోపణ. విచారణ నిమిత్తం తీసుకెళ్ళి తమకు తెలియదు అని పోలీసులు వాదించారు. ఐదు రోజులు దివ్యతేజ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించాం.. మిస్సింగ్ కేసు కూడా నమోదు చేయాలి అని ఒత్తిడి తెచ్చామని అన్నారు.పోలీసులే తీసుకెళ్ళి తీవ్రంగా గాయపరిచారు, పోలీస్ దెబ్బలకే తేజ చనిపోయాడు. మృతదేహాన్ని కూడా మాయం చేయాలి అని చూశారు. హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఒక గంటలో మృతిదేహం లభించింది అని డ్రామా చేశారని ఆరోపించారు. హైకోర్టును ఆశ్రయించకపోయింటే శవాన్ని కూడా ఇచ్చే వారు కాదు.

బెజవాడ మేయర్ రేసులో వంగవీటి రాధా

విజయవాడ, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగరంలో ఊహించని రాజకీయ పరిణామాలు ఊపందుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించిన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వెలువడే సూచనలు కనిపిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో కదలిక మొదలైంది. ఈ తరుణంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి వంగవీటి మోహన రంగా తనయుడు, సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణకు ప్రత్యేక పిలుపు రావడం బెజవాడ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సీఎం చంద్రబాబుతో రాధా త్వరలోనే భేటీ కానున్నారన్న వార్త విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమీకరణాలను పూర్తిగా మార్చేలా కనిపిస్తోంది.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లకు ఈసారి కౌన్సిలర్లు కాకుండా, ప్రజలే నేరుగా ఓటు వేసి మేయర్లను ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల పద్ధతి ని ప్రవేశపెట్టాలని కూటమి ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. విజయవాడ నగర కార్పొరేషన్ భౌగోళికంగా తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అంటే, ప్రత్యక్ష పద్ధతిలో మేయర్‌గా పోటీ చేయడమంటే దాదాపు మూడు అసెంబ్లీ స్థానాల విస్తీర్ణంలో, లక్షలాది మంది ఓటర్లను నేరుగా ఎదుర్కోవాల్సి రావడం. ఇంతటి విస్తృతమైన పరిధిలో కేవలం పార్టీ గుర్తు మాత్రమే సరిపోదని, నగరం మొత్తాన్ని ప్రభావితం చేయగల బలమైన ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని బరిలోకి దించితేనే విజయం నల్లేరుపై నడక అవుతుందని టీడీపీ అగ్రనాయకత్వం ఒక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.విజయవాడ నగర సామాజిక, రాజకీయ ముఖచిత్రంలో వంగవీటి కుటుంబానికి తరగని అభిమాన గణం ఉంది. రంగా పేరు వింటే నేటికీ బెజవాడలో ఒక ప్రత్యేకమైన ఉద్వేగం కనిపిస్తుంది. కాపు సామాజిక వర్గంతో పాటు ఇతర దిగువ, మధ్యతరగతి ప్రజల్లోనూ, యువతలోనూ రాధాకు మంచి ఆదరణ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించినప్పటికీ, అప్పట్లో సీట్ల సర్దుబాటు వల్ల రాధాకు ప్రత్యక్షంగా టికెట్ లభించలేదు. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆయన ఎలాంటి పదవినీ ఆశించలేదు. ఇప్పుడు స్వయంగా మూడు నియోజకవర్గాల సమానమైన మేయర్ పీఠానికి ఆయనను బరిలో దింపడం ద్వారా ఆయన స్థాయిని తగ్గించకుండానే సరైన గౌరవం ఇచ్చినట్లవుతుందని కూటమి పెద్దలు భావిస్తున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరగబోయే కీలక భేటీలో ప్రధానంగా మేయర్ అభ్యర్థిత్వం గురించే చర్చించనున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యక్షంగా మేయర్ రేసులో నిలబడేందుకు రాధా సిద్ధంగా ఉన్నారా లేదా ఆయన ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది చంద్రబాబు నేరుగా తెలుసుకోనున్నారు. ఒకవేళ రాధా నేరుగా పోటీకి విముఖత చూపితే, ఆయన కుటుంబానికి చెందిన వారిని బరిలోకి దింపి, రాధాకు త్వరలోనే ఎమ్మెల్సీ లేదా ప్రభుత్వంలో సముచిత కార్పొరేషన్ పదవి ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై కూడా చర్చ జరుగుతోందని టాక్. ఒకవేళ చంద్రబాబు ప్రతిపాదనకు రాధా గ్రీన్ సిగ్నల్ ఇస్తే పోటీ ఖాయమని అనుకోవచ్చు



స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం నెల్లూరు స్వర్ణభారత్ ట్రస్ట్ లో కార్యక్రమం

హాజరు కానున్న పలు రంగాలకు చెందిన ప్రముఖులు

నెల్లూరు, 5 సెప్టెంబర్ స్వర్ణభారత్ ట్రస్ట్, వెంకటాచలం (నెల్లూరు చాప్టర్) రజతోత్సవాలకు సిద్ధమైంది. సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 11 గంటల నుంచి జరగనున్న ఈ కార్యక్రమానికి ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు వెంకటాచలం చేరుకోనున్న యోగి ఆదిత్య నాథ్ , 11.30 గంటలకు అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా నైపుణ్య కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం 12.00 గంటలకు అక్షర విద్యాలయాన్ని సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించనున్నారు. అనంతరం 2.00 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ కు చేరుకుని రజతోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు.భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి మానసపుత్రికగా 25 ఏళ్ళ క్రితం ప్రభవించిన స్వర్ణభారత్ ట్రస్ట్ లక్షలాది మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపింది. నైపుణ్యాభివృద్ధి ద్వారా వారి సాధికారికతకు బాటలు వేసింది. ముచ్చింతల్ (హైదరాబాద్ చాప్టర్, ఆత్మూర్ (విజయవాడ చాప్టర్) ద్వారా సేవలను విస్తరిస్తూ... దేశవ్యాప్తంగా ఎంతో మంది యువతకు ఉచిత వసతితో పాటు నైపుణ్య శిక్షణను అందించి వారు తమ కాళ్ళమీద నిలబడేలా చొరవ తీసుకుంది. సంపూర్ణ గ్రామీణ సాధికారత సాధనలో 25 ఏళ్ళ సేవా వసంతాలను పూర్తి చేసుకున్న స్వర్ణ భారత్ ట్రస్ట్... సెప్టెంబర్ 7, సోమవారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి నెల్లూరు వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రజలందరినీ సాదరంగా ఆహ్వానిస్తోంది.ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో పాటు... స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తి ప్రదాత, పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి... తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహణా బృందం తెలియజేసింది.


వ్యాపారాలు జోరందుకున్నా ఎస్‌జీఎస్టీ ఎందుకు పడిపోయింది

విజయవాడ, సెప్టెంబర్ 5, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన తర్వాత పరిశ్రమలు వస్తున్నాయని, నిర్మాణ రంగానికి ఊపొచ్చిందని, వ్యాపార లావాదేవీలు క్రమంగా పుంజుకుంటున్నాయని అధికార వర్గాలు చెబుతున్న తరుణంలో.. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ , కేంద్ర జీఎస్టీ పోర్టల్ విడుదల చేసిన తాజా గణాంకాలు ప్రభుత్వానికి ఊహించని షాక్ ఇచ్చాయి. 2025-26 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్లో రాష్ట్ర సొంత వస్తు సేవల పన్ను రాబడి ఏకంగా మైనస్ 7 శాతం క్షీణించింది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం గతేడాది కంటే పెరగాల్సింది పోయి, ఏకంగా నెగెటివ్ గ్రోత్‌లోకి జారిపోవడం ఆర్థిక నిపుణులను, ప్రభుత్వ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.మార్కెట్‌లో కనిపిస్తున్న సందడికి, ప్రభుత్వ ఖజానాకు చేరే నికర రాబడికి మధ్య ఎందుకు ఇంత భారీ అంతరం ఏర్పడిందనేదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. ఒకవైపు నిర్మాణ పనులు వేగం పుంజుకోవడం, ఇసుక పాలసీ మార్పులు, వ్యాపారాల్లో కొనుగోళ్లు మెరుగైనట్లు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నప్పటికీ.. పన్నుల లెక్కల్లో ఆ గ్రోత్ కనిపించకపోవడం వెనుక ప్రధానంగా సాంకేతిక, ప్రక్రియపరమైన లొసుగులు ఉన్నాయని చెబుతున్నారు. వ్యాపారాలు జరిగినంత మాత్రాన పన్నులు వెంటనే ప్రభుత్వ ఖాతాలోకి జమ కావు. ముఖ్యంగా వర్తకులు గతంలో నిలిచిపోయిన పెద్దమొత్తం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసుకోవడం వల్ల ప్రస్తుత త్రైమాసికంలో చెల్లించాల్సిన నికర నగదు పన్ను నామమాత్రంగా మారిపోయింది.మరో ప్రధాన కారణం ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లలో జరిగిన తీవ్రమైన జాప్యం. ఏపీ ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి సరుకులను ఎక్కువగా దిగుమతి చేసుకునే వినియోగ ఆధారిత రాష్ట్రం. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వస్తువులపై కేంద్రం వసూలు చేసే ఐజీఎస్టీ నిధులను రాష్ట్రాలకు క్రమం తప్పకుండా సెటిల్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ తొలి త్రైమాసికంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లు సమయానికి కాగ్ ఖాతాల్లో సర్దుబాటు కాకపోవడం వల్ల, కాగితాలపై రాష్ట్ర సొంత ఎస్‌జీఎస్టీ వసూళ్లు తక్కువగా రికార్డయ్యాయి. వస్తువుల వినియోగం పెరిగినా,

కేంద్ర సెటిల్‌మెంట్లలో జాప్యం జరిగితే ఆ ప్రభావం నేరుగా రాష్ట్ర లెక్కల్లో పతనంగా కనిపిస్తుంది. పొరుగు రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఈ తేడా మరింత స్పష్టంగా, ఆందోళనకరంగా బయటపడుతోంది. పక్కనే ఉన్న తెలంగాణలో తొలి త్రైమాసికంలో ఎస్‌జీఎస్టీ వృద్ధి ఏకంగా ప్లస్ 16 శాతంగా నమోదు కాగా, కర్ణాటక , కేరళ , మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు రెండంకెల స్థాయిలో పన్ను రాబడిని పెంచుకున్నాయి. ఒకే దేశం, ఒకే రకమైన జీఎస్టీ చట్టాలు ఉన్నప్పటికీ తమిళనాడు , రాజస్థాన్ , ఒడిశాలతో పాటు ఏపీ కూడా మైనస్ గ్రోత్‌లోకి పడిపోవడం చూస్తే.. ఇతర రాష్ట్రాలు తమ తయారీ, సేవా రంగాల నుంచి నగదు రూపేణా పన్ను రాబడిని రాబట్టుకుంటున్న వేళ, ఏపీ మాత్రం పన్ను వసూళ్ల వ్యవస్థలో లీకేజీలు, రిటర్న్స్ పరిశీలనలో వెనుకబడిపోయిందని స్పష్టమవుతోంది.దీనికి తోడు క్షేత్రస్థాయిలో వ్యాపారాలు జరుగుతున్నా.. అవి పన్ను నెట్‌వర్క్‌లోకి పూర్తిగా రాని అసంఘటిత లావాదేవీలుగానే మిగిలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రిటైల్ మార్కెట్లో చాలావరకు బిల్లులు లేకుండా జరిగే అమ్మకాలు, చెక్‌పోస్టులు లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి పన్ను ఎగవేసి వచ్చే అక్రమ సరుకు రవాణాను కట్టడి చేయడంలో వాణిజ్య పన్నుల శాఖ తగినంత దూకుడు ప్రదర్శించలేకపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు, పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంటున్నప్పటికీ, అవి పూర్తిస్థాయిలో ఉత్పత్తి దశకు వచ్చి పన్నులు సమకూరేందుకు కొంత సమయం పడుతుందన్నది వాస్తవమే అయినా, ఇప్పటికే ఉన్న మార్కెట్ నుంచి రావాల్సిన పన్నులు జారిపోవడం యంత్రాంగ లోపమేనని చెప్పాలి. ఈ మైనస్ 7 శాతం పతనం రాబోయే బడ్జెట్ నిర్వహణపై, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై తీవ్ర ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉంది. ఉచిత పథకాలు, సూపర్ సిక్స్ హామీలకు వేల కోట్ల రూపాయల నిధులు అవసరమైన ప్రస్తుత పరిస్థితుల్లో.. సొంత పన్నుల రాబడే పడిపోతే అప్పులపై ఆధారపడటం మినహా మరో దారి ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఐటీసీ క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయి ఆడిటింగ్ నిర్వహించడం, ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లను కేంద్రంతో సమన్వయం చేసుకుని త్వరితగతిన తెచ్చుకోవడం, జీఎస్టీ ఎగవేతలపై నిఘా పెంచడం వంటి చర్యలు చేపట్టకపోతే ఖజానా మరింతగా లోటులోకి జారుకోవడం ఖాయమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

స్పోర్ట్స్ గ్యాలరీ

యూఎస్ ఓపెన్: గంజాయి వాసన వస్తోందని మ్యాచ్ ఆపేసిన సబలెంకా



యూఎస్ ఓపెన్ టోర్నీలో ప్రపంచ నంబర్ వన్ టెన్నిస్ స్టార్ అరీనా సబలెంకాకు ఓ వింత అనుభవం ఎదురైంది. కోర్టు చుట్టు పక్కల నుంచి గంజాయి వాసన వస్తోందని ఆమె మ్యాచ్‌ను కాసేపు ఆపించింది. శుక్రవారం ఉజ్బెకిస్థాన్‌కు చెందిన కమిల్లా రఖిమోవాతో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో సబలెంకా 3-0 ఆధిక్యంలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తాను సర్వీస్ చేస్తుండగా కోర్టులోకి గంజాయి వాసన ఘాటుగా వస్తోందని అంపైర్‌కు ఫిర్యాదు చేసింది.'ఎవరో గంజాయి తాగుతున్నారు. వాసన చాలా ఎక్కువగా, ఘాటుగా వస్తోంది. దయచేసి ఏదైనా చేయండి' అంటూ సబలెంకా అంపైర్‌కు చెప్పింది. అయితే స్టేడియంలో ధూమపానం అనుమతించరు. కానీ న్యూయార్క్‌లో 21 ఏళ్లు దాటిన వారు గంజాయి తాగడం చట్టబద్ధమే. ఆ ఘటన తర్వాత మ్యాచ్ యథావిధిగా కొనసాగింది. ఈ వింత ఘటనను పక్కనపెడితే.. సబలెంకా కోర్టులో అదరగొట్టింది. రఖిమోవాపై 6-3, 6-4 తేడాతో విజయం సాధించి యూఎస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే మ్యాచ్ అనంతరం సబలెంకా ఈ ఘటనపై స్పందించింది. 'ఎవరైనా వాళ్లకు నచ్చినట్లు ఉండటంపై నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ టెన్నిస్ కోర్టు సమీపంలో గంజాయి లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. అత్యుత్తమ స్థాయిలో ఆడేందుకు మేము ప్రయత్నిస్తున్నప్పుడు ఆ వాసన తట్టుకోవడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది' అంటూ పేర్కొంది.

బీసీసీఐకి ఐవోఏ షాక్.. సొకర్యాలు నచ్చకపోతే సొంతంగా ఏర్పాటు చేసుకోండి!



జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రీడల్లో వసతి సదుపాయాలు, క్రికెట్ మైదానంలోని పిచ్ నాణ్యతపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా ఆటగాళ్లు ఉండేందుకు చాలా చిన్న గదులను సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ)కు ఓ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. తమ ప్లేయర్ల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బీసీసీఐ చేసిన విజ్ఞప్తిని ఐవోఏ తిరస్కరించినట్లు తెలుస్తోంది.తమ ప్లేయర్ల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బీసీసీఐ చేసిన విజ్ఞప్తిని ఐవోఏ తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా ఎవరికీ ఇలాంటి వసతి సదుపాయాలు కల్పించడం లేదని, క్రికెటర్లకైనా తమ నిబంధనలు ఒకేలా ఉంటాయని ఐవోఏ స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే సొంతంగా క్రికెటర్లకు వసతి కల్పించే అవకాశం బీసీసీఐకి ఉందని ఐవోఏ సీఈవో రఘురామ్ అయ్యర్ చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి.'క్రికెటర్ల వసతి ఏర్పాట్ల గురించి బీసీసీఐ సీఈఓ హేమాంగ్ అమిన్ మమ్మల్ని సంప్రదించారు. మేమిద్దరం సుదీర్ఘమైన చర్చలు జరిపాం. ఆసియా క్రీడల్లో సదుపాయాలను అంచనా వేయడానికి జపాన్‌కు ఓ బృందాన్ని పంపించాలని క్రికెట్ బోర్డు భావించింది. ఐవోఏ కూడా అందుకు అంగీకరించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను బట్టి అక్కడి నిర్వాహకులు కల్పించిన సదుపాయాలను బీసీసీఐ వినియోగించుకుంటుందా? లేకపోతే స్వతహాగా ఏర్పాట్లు చేసుకుంటుందా? అనేది వారి ఇష్టం. సొంతంగా వసతి కల్పించుకుంటామంటే ఐవోఏకు అభ్యంతరం లేదు. ఐవోఏ మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించదు' అని అయ్యర్ చెప్పినట్లు కథనాలు పేర్కొన్నాయి.

ఒకేరోజు రిటైర్‌మెంట్.. ఆ విషయం చెప్పగానే ధోని షాకయ్యాడు: సురేశ్ రైనా



భారత క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనితో తనకున్న అనుబంధం గురించి మాజీ క్రికెటర్ సురేశ్ రైనా ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. 2020 ఆగస్టు 15న ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ధోని రిటైర్‌మెంట్ ప్రకటించిన కాసేపటికే రైనా కూడా అనూహ్యంగా ఆటకు గుడ్‌బై చెప్పాడు. ఒకే రోజు ధోనితో పాటు రిటైర్‌మెంట్ ప్రకటించడానికి గల కారణాన్ని రైనా తాజాగా వివరించాడు.'క్రికెట్ కోసమే జీవిస్తాం. దేశం కోసం ఎంతో చేస్తాం. మన తల్లిదండ్రులు కూడా ఎన్నో త్యాగాలు చేస్తారు. కానీ ఆ సమయంలో నాకు అదే సరైన నిర్ణయం అనిపించింది. కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని అనిపించింది. రిటైర్‌మెంట్ ప్రకటించినప్పుడు నా వయసు 33 ఏళ్లు. ఏదైతే అది అని.. నా నిర్ణయాన్ని చెప్పేశా. అప్పటికే ధోని అధికారికంగా ఆటకు వీడ్కోలు పలికాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ధోని దగ్గరకు వెళ్లి 'అంతా అయిపోయింది' అని చెప్పా. వెంటనే 'ఏం చేశావ్ నువ్వు?' అంటూ షాకయ్యాడు' అని రైనా గుర్తు చేసుకున్నాడు.'అప్పుడు కెప్టెన్ లేదా జట్టు కోసం క్రికెట్ ఆడేవారు. నాకు అవకాశం రావడానికి కెప్టెన్ కూడా కారణమే. ధోని తన బ్యాటింగ్ స్థానాన్ని నా కోసం త్యాగం చేశాడు. సౌరభ్ గంగూలీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు ధోని టాపార్డర్‌లో ఆడేవాడు. కానీ ఆ తర్వాత బాధ్యత తీసుకుని.. యువరాజ్ సింగ్‌ను, నన్ను టాపార్డర్‌కు పంపి తాను ఫినిషర్‌గా వెళ్లాడు. ఈ వ్యక్తి తనపై కంటే నా సామర్థ్యాలపై ఎక్కువ నమ్మకం ఉంచుతున్నాడని అనిపించింది. అలాంటప్పుడు నేను అతడి కోసం తప్పక రాణించాలి అనుకున్నాను. మేమంతా జట్టులో భాగమే. అందుకే ఫీల్డింగ్, బౌలింగ్, బ్యాటింగ్ ఏదైనా మనసు పెట్టి ఆడాలని నిర్ణయించుకున్నాను' అని రైనా వెల్లడించాడు.'మనం ఓ దశకు చేరుకున్న తర్వాత మెదడుతో కాదు మనసుతో ఆలోచించడం మొదలుపెడతాం. మనసు ఎక్కడ అనుబంధం పెంచుకుంటే.. ఆ బంధం, స్నేహం ఎప్పటికీ అలాగే ఉంటుంది. ఎవరో మన కోసం ఎంతో త్యాగం చేస్తే.. మనం కూడా తిరిగి ఏదైనా ఇవ్వగలగాలి. అందరికీ డబ్బు ఉండొచ్చు. కానీ దాన్ని పంచడానికి పెద్ద మనసు ఉండాలి. మా స్నేహంలో అలాంటి పెద్ద మనసు ఉంది. అది ఎప్పటికీ అలాగే ఉంటుంది' అని ధోనితో ఉన్న అనుబంధాన్ని రైనా గుర్తు చేసుకున్నాడు.

పాక్‌తో మ్యాచ్.. స్మృతి మంధానని ఊరిస్తున్న ఆల్‌టైమ్ రికార్డు



మహిళల టీ20 ఆసియా కప్2026లో అసలైన పోరుకు సమయం ఆసన్నమైంది. శనివారం దుబాయ్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఇదే సమయంలో టీమిండియా స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానను ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...లేడీ విరాట్ కోహ్లీగా పేరొందిన స్మృతి మంధాన ఇప్పటికే అనేక రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా మంధాన రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలోనే మరో 78 పరుగులు సాధిస్తే మరో రికార్డు స్మృతి ఖాతాలో పడుతుంది. మరో 78 పరుగులు చేస్తే.. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తుంది. ప్రస్తుతం న్యూజిలాండ్ దిగ్గజం సూజీ బేట్స్ (4,758 పరుగులు) అగ్రస్థానంలో ఉంది. మంధాన ఇప్పటివరకు 167 మ్యాచ్‌లలో 30.79 సగటుతో 4,681 పరుగులు చేసింది.ప్రస్తుత టోర్నీలో మంధాన అదరగొడుతోంది. ఇటీవల హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో మెరుపు సెంచరీ(124)తో సత్తా చాటిన ఆమె, కేవలం రెండు మ్యాచ్‌లలోనే 143 పరుగులు చేసింది. స్మృతి ఉన్న జోరు చూస్తుంటే బేట్స్ రికార్డును అధిగమించడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్లు

సుజీ బేట్స్(న్యూజిలాండ్) 4758స్మృతి మంధాన(భారత్)-4681హర్మన్‌ప్రీత్ కౌర్(భారత)- 4231చమరి అటపట్టు(శ్రీలంక)- 4094సోఫీ డివైన్(న్యూజిలాండ్)- 3817

నయనతార ఇంట్లో పీవీ సింధు సందడి.. ఫొటోలు వైరల్!

భారత బ్యాడ్మింటన్ స్టార్, డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు.. ప్రముఖ నటి నయనతార ఇంట్లో సందడి చేసింది. నయన్, ఆమె భర్త విఘ్నేశ్ శివన్.. సింధు దంపతులను తమ ఇంటికి ఆహ్వానించి ఆత్మీయంగా విందు ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలను సింధు సోషల్ మీడియాలో పంచుకుంది. ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగ పోస్టు పెట్టింది. వారు దిగిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి.'అందమైన సాయంత్రం. అద్భుతమైన భోజనం. మనస్ఫూర్తిగా సాగిన సంభాషణలు. అంతులేని నవ్వులు. కొన్ని విందులు మనుషుల గురించి మన అభిప్రాయాలనే మార్చేస్తాయి. స్నేహితులుగా వారి ఇంటికి వెళ్లాం. అక్కడ జీవితం, ప్రేమ ఇలా ఎన్నో విషయాల గురించి మాట్లాడుకున్నాం. కానీ బయటకు వచ్చే సమయానికి ఎన్నో ఏళ్లుగా ఒకరికొకరం తెలుసన్న భావనకు వచ్చేశాం. చెన్నై ఇప్పుడు నాకు సొంతింటి లాగా అనిపిస్తోంది. ఈరోజు తర్వాత చెన్నైలో నాకోసం ఎదురుచూసే కుటుంబం ఇంకాస్త పెరిగినట్లు అనిపిస్తోంది. విక్కీ, నయన్.. మీరు నాపై చూపించిన ప్రేమకు ఎంతో ఆనందంగా ఉంది' అని సింధు ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. సింధు పోస్టుకు నయనతార, విఘ్నేశ్ శివన్ కూడా 'మీరిద్దరూ చాలా స్వీట్' అంటూ స్పందించారు.



నా ప్రత్యర్థులంతా పిరికివాళ్లే.. ఒలింపిక్ ఛాంపియన్ సంచలన వ్యాఖ్యలు


ఇంటర్నెట్ డెస్క్: ఒలింపిక్ ఛాంపియన్, నార్వే స్టార్ అథ్లెట్ జాకబ్ ఇంగెబ్రిస్టన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. డైమండ్ లీగ్ ఫైనల్‌లో పురుషుల 1500 మీటర్ల రేసులో జాకబ్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఆ ఓటమి తర్వాత అతడు ప్రత్యర్థుల రేసింగ్ వ్యూహాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. తాను పిరికివాళ్లతో పోటీ పడ్డానంటూ ఘాటుగా స్పందించాడు. ఈ పోరులో ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మైయర్స్ 3:30.14 టైమింగ్‌తో డైమండ్ లీగ్ టైటిల్ సాధించాడు. కెన్యాకు చెందిన ఫానుయెల్ కిప్‌కోగ్సెయి కేవలం 0.04 సెకన్ల తేడాతో రెండో స్థానంలో నిలిచాడు. అమెరికాకు చెందిన ఈతన్ స్ట్రాండ్ 3:30.50తో మూడో స్థానంలో ఉండగా.. జాకబ్ 3:30.52 టైమింగ్‌తో నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు.'నా ప్రత్యర్థులందరూ ఒకరి వెనుక ఒకరు వరుసలో పరిగెత్తుతూ దాక్కోవాలని అనుకున్నారు. నేను మాత్రం అలా దాక్కుని రేసులో పాల్గొనే వ్యక్తిని కాదు. పేస్‌మేకర్ సరిగ్గా వ్యవహరించలేదు. నన్ను వేవ్‌లైట్ నుంచి, నిర్ణయించిన వేగం నుంచి దూరం చేశాడు. నేను అలా పరిగెత్తాలని అసలు అనుకోలేదు. అమెరికా స్టార్ కోల్ హాకర్ రేసింగ్ వ్యూహం కూడా చెత్తగా ఉంది. ఫ్రెంచ్ పేస్‌మేకర్ స్థానంలో తన సొంత సహచరుడిని తీసుకొచ్చాడు. అతడు పేస్‌మేకర్‌ను అనుసరించడానికి ప్రయత్నిస్తున్నాడని అందరూ అనుకున్నారు. కానీ అది ఒక వ్యూహం. అతడు మనందరినీ మోసం చేశాడు. మిగతావాళ్ల వెనుక దాక్కుని పరిగెత్తాడు. ఈ రేసు, ఫలితం నన్ను తీవ్రంగా నిరాశపరిచాయి. నేను పిరికివాళ్లతో పోటీ పడ్డాను. అంతే! కామెరాన్ మాత్రమే నిజాయతీగా ఆడాడు. బాగా రేస్ చేశాడు. మిగతావాళ్లంతా ఓడిపోయిన వాళ్లలా కనిపించారు. అందులో నేనూ ఉన్నాను' అని జాకబ్ వ్యాఖ్యానించాడు.



సినిమా

కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.



క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ



సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ వుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

కిరణ్ అబ్బవరం మూవీకి హతః టైటిల్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత



క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు.

షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి ప్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.



మారెమ్మ ట్రైలర్ విడుదల



మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్ర బృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది. ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు.అయితే 'మారెమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు.ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణ విలేజ్ డ్రామాకు భిన్నంగా దైవ విశ్వాసం, గ్రామీణ ఆచారాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను కలిపి కథను నడిపించినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించగా.. వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపలక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు.ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తిని పెంచిన 'మారెమ్మ' సెప్టెంబర్ 10న థియేటర్లలోకి రానుంది. గ్రామీణ నేపథ్యంలోని మిస్టరీ, యాక్షన్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.

మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బె÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844